తల్లీ... గోదారీ...!

పాలకోడేటి సత్యనారాయణరావు

బస్సు కదిలింది- ఇంటి ముఖం పట్టింది. బస్సులోకి చూస్తోంటే ఎన్నో సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి.

మూర్తి మనసొకసారి బావురు మంది.

అక్కడ-అదిగో. ఆ డ్రైవర్ సీటు పక్కన ఉన్న సీట్లో రాజు కూర్చునే వాడు. ఆ సీటు కోసం ఎంత గొడవ పడ్డాడో- "మాస్టారూ! ఆసీట్లో నేను కూర్చుంటానండీ- అక్కడి నుంచి అన్నీ చూడొచ్చు!" అని అడిగాడు రాజు. సరే నన బోయేంతలో మరో కుర్రాడు ఆసీటు తనకు కావాలన్నాడు. ఆ తర్వాత మరో కడు.... ఒక సీటు కోసం ఎంత పోటీ....! ఆఖరికి తను లాటరీ వేశాడు. రాజుకే వచ్చింది. రాజు సంబరం ఆకాశాన్ని అంటింది ఆనంతోషంలో అంతా అతని ముఖంలో కొట్టొచ్చినట్లు..

కానీ.... ఏడీ ఆరాజు ఇపుడు? ఆ సీట్లో లేడే?

—ఏమై పోయాడు ?

అతనిలోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది కానీ అతను కనపడడేం ?

అలాగే- ఇదిగో, ఇక్కడ ఈ డోర్ పక్క సీట్లో మురళి కూర్చునే వాడు. ఇపుడు మురళి లేడు. ఆసీటూ బావురు మంటూ ఉంది.

అసలు బస్సు బస్సంతా అలాగే ఉంది.

ఎందుకిలా ఇంత బావురు మంటోంది బస్సు??

—ఎందు కింత నిశ్శబ్దంగా ఉందీ ప్రయాణం?

ఇంటి నుంచి వస్తున్న క్షణాల్లో ఎంత సందడి, ఎంత ఉత్సాహం, ఎంతగోల! ఎన్నిపాటలు, ఎన్ని ఆటలు, ఎన్ని మాటలు ...!!

ఏమై పోయాయి అవన్నీ ఈ క్షణంలో!

ఇందరు పిల్లల్లోనూ ఇంత నిస్సత్తువ దేనికి?

ఇందరు పిల్లలోనూ ఇంత నిర్జీవం గూడు కట్టు కొందేం??

-ఆ ఘోరం తల్చుకుంటే....

కళ్ళు నీళ్ళు నింపుకొంటున్నాయి. మనసు ముక్కలై పోతోంది. ఏమీ చేయలేక పోయిన దౌర్భాగ్యం ఏడిపిస్తోంది.

వద్దు-పగవాడికి సైతం ఇంత శిక్ష వద్దు.

ఎంత సంబరంగా ఉండాల్సిన తిరుగు ప్రయాణం ఇది! ఇలా శోకం కోల్పోయి...

ఎక్కడో ఎపుడో తనే- ఏదో జన్మలో ఏదో పాపం చేసి ఉంటాడు. లేకపోతే. ఇంతటి ఘోరం తన చేతుల మీదగా జరిగి ఉండేది కాదు!

ఎలా జరిగి పోయింది క్షణాల మీద, కన్ను మూసి కన్ను తెరిచే లోపున.... -అంతా అయి పోయింది.

-ఖచ్చితంగా నెల రోజుల క్రితం ఈ పాపానికి పునాది రాయిని తనే వేశాడు. ఆ రోజు స్టాఫ్ రూంలో కూర్చుని మాట్లాడుతూంటే అన్నాడు తనే-" పిల్లల్ని పిక్నిక్ తీసుకెడితే బాగుం టుంది, వాళ్ళకూ మనకూ ఈ రొటీన్ బోర్ కొట్టేస్తోంది!"

గొప్ప అయిడియాలు వస్తాయండీ మీకు! అంది కుమారి వేళా కోళంగా.

మూర్తిమనసు నొచ్చుకొంది- "అదేం అలా అంటారు?" అడిగాడు.

"కాకపోతే ఏమిటండీ? ఈ కుర్ర మేళంతో ఇపుడే ఇక్కడే వేగ లేక పోతున్నాం కదా- ఇంకా అది చాలక, వాళ్ళతో పిక్నిక్- తిరిగి వచ్చేసరికి జీవితం మీద ఆశంతా చచ్చి పోతుంది!"

కుమారి పద్ధతి తప్పనిపించింది. తన పిల్లల్ని పెంచడం చేతకాక పిల్లలే వద్దు అనుకునే తత్వం అది. చక్కగా చెప్పితే ఎందుకు వినరు?

ఇలాటి వాళ్ళకు నచ్చ చెప్పటం కష్టం. తనుచేసి చూపిస్తాడు. -మనసు లోనే నిర్ణయం తీసుకొని హెడ్మాస్టర్తో మాట్లాడాడు.

ఆయన తన ఆలోచనలకు సరే నన్నాడు. కానీ.... "తీసుకెళ్ళటానికి ఎవరూరారు మూర్తి! ఎవరికీ వాళ్ళు తమకి బాధ్యత వద్దనే వాళ్ళే కానీ- అందుకే నాకు ఈఆలోచన మూడు నాలు గేళ్ళ నుంచీ ఉన్నా అమలులో పెట్ట లేక పోతున్నాను!" అన్నాడు.

"మీరు ఊ అనండి, నేను తీసు కెడ తాను! నాతో ఎవరైనా వస్తారేమో నేను స్టాఫ్ రూంలో కనుక్కొంటాను!"

"ఆసంగతి తేల్చుకోండి! మీరొక్కరూ ఇందర్ని కాచు కోవటం కష్టం, మీకు కొంత సాయం ఉంటే. మీరు సిద్ధపడితే అప్పుడు మిగతా విషయాయి ఆలోచించు కోవచ్చు"

ఆలోచించుకోవడానికి ఏముంది? అను కున్నాడు మూర్తి కానీ.... స్టాఫ్ రూంలో ఏ ఒక్కరు సిద్ధపడలేదు. ఈ బాధ్యత నెత్తిమీద వేసుకోటానికి - ఊహు- తనతో పంచుకోవటానికి!!

ఆఖరికి తనే-తనొక్కడే....

కుమారి నవ్వేసింది." మీకేమండి- మీరు ఒంటరి పక్షులు - ఎక్కడికంటే అక్కడికి ఎలాఅంటేఅలా వెళ్ళిపోగలరు. కానీ మాకూ కాదుగద!" అంది. అన టంలో వ్యంగ్యం ఉంది. కానీ తన మన సులో ఉన్న బాధను లేపే ప్రయత్నమూ ఉంది.

సీతపోయి నాలుగేళ్ళయింది. కేశవు డొక్కడే మిగిలడు తనకు. వాడూ ఇప్పుడు తనతో స్కూల్లోకి వస్తుంటాడు. ఉదయం లేచిలేవగానే వంటప్రయత్నం చేసుకోవటం, వంటపూర్తయ్యాక ఇద్దరూ

కలసి భోజనం చెయ్యటం. స్కూలుకు చేరటం-సాయంత్రం వరకూ అదే సరిపోతుంది. దీపాలు పెట్టే వేళకు గూటికి చేరుకుని మళ్ళీ వంట. తర్వాత నిద్ర – జీవితంలో ఛార్మ్ లేకపోయినా – ఏదో గా జరిగిపోతున్నాయి !

ఓన్నే కుమారి "ఒంటరి పక్షులు" కనవడినా– ఆ స్వేచ్ఛ వెనుక ఎంత
అంటుంది! పైకి స్వేచ్ఛగా ఉంటున్నట్లు గుండెకోత ఉందో ఎలా చెప్పాలి? ఎవ

రికి వాళ్ళు ఊహించుకోవాలి కానీ.... కుమారిలాంటి మూర్ఖురాలికి చెప్పినా ఒకటే చెప్పకపోయినా ఒకటే!! అందుకే తను అలాంటి ప్రయత్నం చేయడు. సీత జ్ఞాపకాలనుంచి తను తప్పించుకోవాలంటే, కేశవుడికి కొంత సంతోషాన్ని కలుగజేయాలంటే-తను పిల్లల్ని పిక్నిక్ కు తీసుకెళ్ళక తప్పదు-నిర్ణయించుకున్నాడు మూర్తి.

హెడ్మాస్టరు కూడా సరే నన్నారు. బాగా ఆలోచించి ఏ ఊరికి వెళ్ళాలో, అక్కడ ఏం పిల్లల్ని ఆకట్టుకునేవి ఉన్నాయో అన్నీ ప్లాన్ చేశాడు ను.

తన ఊహాలు విని స్టాఫ్‌రూంలో అందరూ తలోరకంగా వ్యాఖ్యానించారు

"రాజమండ్రియా? ఏముందండీ ఆ వూళ్ళో చూసేందుకు?"

కుమారి నవ్వుతూ జవాబిచ్చింది- "లేకేం ఊరికు ఆ చివరినుంచి ఈ చివర వరకూ పెద్ద గోదవరినది ఉంది. అది చాలదూ!"

"అంటే...తీసుకెళ్ళి గోదరిని చూపిస్తారన్నమాట ఇంతకీ" ఇంకోరు వ్యాఖ్యానించారు.

"చూపిస్తే ఏం లాభముండీ, అందులో దింపి తెస్తే వాళ్ళకు కనీసం గోదారి లోతైనా తెలుస్తుంది!!"

వేళాకోళం అది! కానీ పైనఎక్కడో కనపడని ప్రదేశాల్లో మనం ఎక్కలేని ఎత్తుల్లో, మన ఊహలు చేరలేని ప్రదేశాల్లో 'తథాస్తు దేవతలు' ఉంటారట! పసిపిల్లలగురించి కూడా ఇలా దారుణమైన వేళాకోళాలు చేయడం.....!

ఇలటివాళ్ళగురించి తను పట్టించుకోడు.

ఇలాటి వాళ్ళకు రాజమండ్రిలో ఉన్న విశేషాలగురించి చెప్పిలాభంలేదు అక్కడ... ఆంధ్రసాహిత్యానికి నాంది పలికిన ప్రాంతమది. ఆంధ్రదేశానికి వెన్నెముకలా ఉన్న గోదావరితల్లి ఉన్న ప్రాంతమది అక్షరమ్ముక్క రాయాలంటే అవసరమైన కాగితాల్నిచ్చే పేపర్ మిలున్న పట్నమది! అదే అంటే-ఏమంటారో తెలీదికాదా- 'కాగితం ఎలా ఉంటుందో చూపేముందు పలకలు ఎలా ఉంటాయో చెప్పండి. దానికోసం ఏ మార్గాపురమో తీసుకెళ్ళండి ఈ కోలమూ కను!' అంటారు. ఇలాటిజనాన్ని ఏంచేసి దారి మళ్ళించగలం??

అందర్నీ తలోసారీ తల్చుకొని తుర్పు తిరిగి దణ్ణంపెట్టుకోవాలి తప్ప-గత్యంతరంలేదు.

ఎవరేమంటేనేం, ఏమనుకొంటేనేం- పథకానికీ ప్రయాణానికీ హెడ్మాస్టరుగారు పచ్చజెండా ఊపారు.

పని మొదలయింది

ఎవరెవరు వస్తారో ముందువాళ్ళ పేర్లు వేసుకోవటం, డబ్బులు వసూలుచేయటం, తర్వాత స్కూలుతరపు కార్యక్రమానికి ఉన్నతాధికారుల అనుమతి తెచ్చుకోవటం, అవతల ఊళ్ళల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవటం....అన్నీ జరిగిపోయాయి.

బస్సుకూడా మాట్లాడేశారు.

బస్సులు బయలుదేరేటప్పుడు హెడ్మాస్టరు దగ్గరకొచ్చి అన్నారు- "మూర్తి- చాలా కాలంగా ఉన్న కోరిక నాకు ఇది. పదిమంది పిల్లలతో పదివూళ్ళు తిరగా



చదివిన చదువులకు, చేసే ఉద్యోగా కూ ఏ పొంతనాలేని పద్ధతిలో ఎదుగు ారు ఈ ప్రపంచంలో! ఒకరు సైన్సులో ట్టా పుచ్చుకొని కూరలషాపు పెడతారు, రొకరు యం. ఏ. అయి వీధి పక్కన ళ్ళీకొట్టు పెడతారు, మరొకరు తనలాగ దిగీఎదగని టీచరు ఉద్యోగంలో చేర ారు. చేరిన రోజున టీచరుగానే ఈ ద్యోగం ఆఖరిరోజు వరకు ఏమాత్రం దగక టీచరుగానే మిగులుతోంది.

మారే ప్రపంచంలో కూడా మారని ద్యోగాలు కొన్ని అలాగే ఉంటాయి ాబోలు!!

-రాజమండ్రి చేరేవరకు ఆలోచ లు అలాగే సాగాయి మూర్తికి. ఒక షయంపై నిలకడగా ఉండక, ఒక షయాన్ని గురించి ఏదీ తేలక....

ముందే చేసుకొన్న ఏర్పాట్ల ప్రకారం ల్లలను ఓ హైస్కూలులో దింపాడు మూర్తి. క్లాసు ఎంతగోల చేసినా ఇక్కడ మాత్రం అందరూ మంచి క్రమశిక్షణతోనే ఉన్నారు. ఇదే క్రమశిక్షణ వీరికి జీవితంలోనూ అలవడితే ఇంక కొదవ దేనికీ ఉండదు. కానీ ఈ చిన్న పిల్లలు పెరిగి పెద్దయేలోగా ఎన్ని శక్తులు వీళ్ళ మీద పనిచేసి, వీళ్ళను ఏదిశకు దింపుతాయో, ఏదిశకు తిప్పుతాయో ఊహించుకోవటం ఇపుడు కష్టం.

హైస్కూల్లో పిల్లల్ని దింపి "జాగ్రత్తగా ఉండండి" అని ఒక్కొటికి పదిసార్లు హెచ్చరించి మరీ గేటుదాటి వచ్చాడు మూర్తి.

వెళ్ళి-పిల్లల్ని ఎక్కడికి తీసుకెళ్ళాలని నిర్ణయించుకొన్నాడో అక్కడంతా తగిన ఏర్పాట్లు చేసేందుకు మూర్తి కదిలాడు. పేపరు మిల్లులో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌తో కలిసి, మిల్లులోపలికి వెళ్ళేందుకు పర్మిషను కోరాడు. ఆయన పసిపిల్లల గురించి వినగానే సంతోషంగా అనుమతించి, కూడా ఒకగైడ్‌ను ఏర్పాటు

చేసేందుకు కూడా సిద్ధపడ్డాడు. అలాగే అక్కడే చిన్న కేంద్ర ప్రభుత్వ పరిశోధనాలయంలో కూడానూ!

అన్నీ అయ్యాయి అనుకుని నిశ్చింతగా గాలి పీల్చుకోగలిగే టైం దొరికింది మూర్తికి.

తిరిగి వచ్చి-గేటులోంచి స్కూల్లోకి వెళ్ళాక -అక్కడ-సరిగ్గా అక్కడే ఉంది ఆదుర్ముహూర్తం ఏదో! ఎక్కడో తెలీని ప్రాంతంలో ఉండే అతీత శక్తులు ఏవో కొన్ని రాజును ఆవహించినట్లని పించింది. అందుకే అడిగాడు. దగ్గరగా చేరి, అతి నెమ్మదిగా-

"మాస్టారూ! ఈ ఊళ్ళో గోదావరి ఉంది. కదండీ!"

అవునన్నాడు మూర్తి

"గోదావరి పెద్దనది కదండీ!"

మళ్ళీ అవునన్నాడు మూర్తి

"నే నెప్పుడూ గోదారిచూడలేదండీ!"

"ఈసారి చూద్దువుగానిలే!"

"గోదావరికి అవతల పక్క ఉండే ఊళ్ళవాళ్ళు ఎలా వెడతారండి? ఈత కొట్టా?"

నవ్వొచ్చింది మూర్తికి.

"ఈత కొట్టనక్కర్లేదు. లాంచీలు ఉంటాయి!"

"లాంచీలా? అంటే?-" చిన్నతనపు ప్రశ్నలు. ఓపిగ్గా జవాబు చెప్పేకొద్దీ ప్రశ్నల సంఖ్య పెరుగుతాయే తప్ప తగ్గవు.

"లాంచీలంటే-పడవల్లాటిది! నౌక, ఓడ, పడవ, లాంచీ, దోనె-ఇలా అన్నీ ఒకరకమైనవే!"

"మరి వేర్వేరు పేర్లెందుకుపెట్టారు?"

నిజమే-వేరు పేర్లుఎందుకు? జవాబు దాటాల్సినదాన్ని బట్టి కాబోలు! లేకపోతే దీని సైజుబట్టి కాబోలు!!- ఏం చెప్పాలి. ఆలోచిస్తూ క్షణంగడిపి, ఆ తర్వాత అన్నాడు మూర్తి-" ఆ ప్రశ్నకు సమాధానం నువ్వే చెప్పునాకు!"

రాజు తెల్లపోయి చూసి తర్వాత అన్నాడు- "రవాణా సౌకరాలు అనే పాఠంలో ఉంటుందేమోనండి!"

"అదే చదివి చెప్దువుగాన్లే?" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"మాస్టారూ, నాకు లాంచీ ఎక్కాలని ఉందండీ!"

నిజమే, పిల్లలకు లాంచీ చూపిస్తే.... మంచి ఆలోచనే! తనకు తట్టలేదు అనుకున్నాడు మూర్తి.

"సరే, రేపు పొద్దున్నేవెడదాం, గోదావరికి! అందర్నీ సిద్ధంగా ఉండమని చెప్పు!" అన్నాడు మూర్తి.

రాజు హుషారుగా వెళ్ళిపోయాడు.

మర్నాడు లాంచీల రేవుకు చేరుకున్నారు కాంట్రాక్ట్ బస్సులో. లాంచీలరేవు ఆరోజు కొంచెం రష్‌గానే ఉంది. రైల్ కం రోడ్ బ్రిడ్జ్ వేశాక లాంచీల రేవు వెలవెలబోతోంది. అందరూ క్షణాలమీద అవతల వైపుకు బస్సుల్లో చేరగలిగే టప్పుడు గంటసేపుపట్టే ఈ లాంచీని ఎవరు ఎక్కుతారు?

అయినా పిల్లలందర్నీ లైనులోనుంచో బెట్టి లాంచీకి టిక్కెట్లుకొని ఒక్కొక్కర్ని లాంచీలోకి ఎక్కించాడు మూర్తి.

లాంచీలో బయటవాళ్ళు ఎక్కారు.

లాంచీ కదిలింది.

నీటిని నెమ్మదిగా వెనక్కు తోసు



కొంటూ లాంచీ ముందుకు పోతోంది.

గోదావరి నిండుగా నెమ్మదిగా ప్రవహిస్తోంది. ఎంత చల్లని తల్లి! రాష్ట్రంలో ఈ తల్లి చలవ వల్లే ఎండి గిజల కయినా కొంత లోటు తగ్గుతోంది. ఇటు ఈ గోదావరి తల్లి, అటు కృష్ణమ్మ తల్లి లేకుంటే....-మూర్తి ఆలోచనలన్నీ రక రకాలుగా ఉన్నా .

ఇంతలో ఏం జరిగిందో ఏమో-తెలీదుగానీ- ఉన్నట్టుండి లాంచీ లోంచి కేకలు వినిపించాయి. ఎవరో దెబ్బలాడు కోవటమో ఏమో మూర్తికి అర్థంకాలేదు. కొంచెం దృష్టి అటు వైపు మళ్ళించేలోగానే-లాంచీపై నుంచి ఎవరో ఉన్నట్టుండి నీళ్ళలోకి దూకారు.

"లాంచీ మునిగి పోతోంది రోయ్!" -ఎవరో కేకేసారు.

వెంటనే పెద్ద పెట్టున గోల, కేకలు-లాంచీ అంతా ఒక పక్కకు ఒరిగి పోతున్నట్లుంది.

-ఆదెబ్బతో అందరూ రెండో పక్కకు పరిగెట్టారు.

ఈసారి లాంచీ రెండో వైపుకు తిరిగింది.

కేకలు, గోల, గగ్గోలు- పెడబొబ్బలు.

ఆ కేకలన్నిటినీ కంట్రోలు చేసే దు కన్నట్లుగా లాంచీ ఒక్కసారిగా తిరగబడింది.

—గోదారి క్షణం కిందటి వరకు నెమ్మదిగా ఉన్న తల్లి-ఇప్పుడు అలలాగా ఆత్రుతగా లాంచీలోకి దూసుకొచ్చేసింది.

ఏం జరిగిందని ఆలోచించే లోపునే...

—అంతా జరిగి పోయింది!!!

తల మునకలుగా నీళ్ళు - ఊపిరి పీల్చుకోవటానికి వీల్లేనంతగా నీళ్లు ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా-మూర్తికి ఉన్నట్లుండి పిల్లల సంగతి గుర్తొచ్చింది.

గుండెలవిసి పోయాయి అతనికి.

—ఏమైపోయారు వాళ్ళంతా?

ఒక్కసారి తెలివి తెచ్చుకొని. అటూ

ఇటూ చూశాడు

కేకలతో, పరుగులతో- బతకాలనే తాపత్రయంతో, బయట పడాలనే ఆకాంక్షతో- ఒడ్డుచేరాలనే తొందరతో- జీవితంమీద ఆశ అందరిలోనూ కనిపిస్తోంది

ఎవరి చేతనయినట్లు వాళ్లు తమ తమ ప్రయత్నాలు చేసుకొంటున్నారు.

—మూర్తి ఒక్కసారి నీళ్లలోకి మునిగి మళ్ళీ లేచాడు కొండంత ఆశతో పైకి చెప్పలేనంత నమ్మకంతో కనబడని దేవుళ్ళ మీద నమ్మకంతో, కనిపించే పసిపాపల మీద నమ్మకంతో చేతికి అందిన వాళ్ళను చేతికి అందినట్లుగా ఒడ్డున పడెయ్యాలనే ఆకాంక్షతో

ఒకరు-ఇద్దరూ పిల్లల్ని పట్టుకొన్నాడు. మూర్తి వాళ్ళకు దొరక్కుండా వాళ్లు చేతిలోంచి జారిపోకుండా లక్కొచ్చి ఒడ్డునపడేశాడు

మొదటిసారి ఒడ్డుకు చేరిన మూర్తి ఒక్కసారి గోదావరికేసిచూశాక, క్షణం క్రితం తల్లిలా లాలిస్తోందనుకొన్న నది ఈ క్షణంలో కోపంతో బుసలుకొడుతున్నట్లుంది. కోరలు చూపి అలలుపైకెత్తి అందినవార్ని అందుకోవాలనే ఆశగా ఉన్నట్టుంది. నది నీళ్ళల్లోంచి పైకి లేస్తున్న చేతులు, కొట్టుకొంటున్న పిల్లలు

మూర్తి మళ్ళీ నీళ్ళలోకి దూకాడు. బస్సు ఆగింది ఎందుకో మూర్తి ఆలోచనలూ తెగిపోయాయి. ఉన్నట్టుండి గతంలోంచి వర్తమానంలోకి పడ్డాడు.

బస్సు డ్రైవరు కిందకుదిగి ఎవర్నో ఏదో అంటున్నాడు. తొంగిచూస్తే బండి ఏదో అడ్డొచ్చినట్లుగా ఉంది వాడితో కాబోలు ఈ తగవు!!

తగవులంటే భయంవేసింది మూర్తికి

ఇంటికి తిరిగి వెళ్ళాక-అసలు అప్పుడుంటుంది కథ!! మొత్తం పధ్నాలుగు మంది లెక్క తేలకుండా పోయారు కొందరు బతికినా నీరసంతో చావును అనుభవిస్తూ ఉన్నారు-తను ?

తన సంగతి చెప్పనే అక్కర్లేదు.

అనుకోకుండా తలకెత్తుకొన్న వ్యవహారం ఎదురు తిరిగింది

కుముద ఏమంటుంది?- 'ఇందుకే మేం వద్దన్నాం-వినావు కాదు!' అంటుంది కాబోలు!!

కాకపోతే ఇంతక్రితమే అన్నట్లుగా "చూసేవిలాభమని, ఏకంగా గోదారిలో ముంచి మరీ వచ్చారుకదా!" అంటుందేమో!

ఏమన్నా- జరగాల్సినది తన చేతుల మీదుగా జరిగింది ఇప్పటికే ఈ వార్త అంచెలంచలుగా ఊరుచేరిఉంటుంది. బట్టకట్టిన వాళ్ళను వాళ్ళ వాళ్ళకు అప్పజెప్పితే-ఆ తర్వాత ఇంకేమైనా మిగిలితే, దాన్ని గురించి ఆలోచించవచ్చు.

కానీ-

ఆలోచించేందుకు ఏమైనా మిగులుతోందా?

మెదడంతా-రేపటిజీవితంలా, ఇన్నాళ్ల ఒంటరి బతుకులా-శూన్యంగాఉంది.

ఎవరికి ఏంచెప్పాలో ఎలాచెప్పాలో కూడా అర్థంకాని స్థితిలో

స్వగ్రామం చేరింది బస్సు

స్కూలు దగ్గరికి అప్పటికే కొందరు చేరారు అంటే ఈ వార్త అప్పటికే చేరిందన్నమాట ఈ ఊరు!!

ఖాళీ బస్సులోంచి ఒకరొకరుగా దిగరు పిల్లలు. ఒక్కొక్కరు దిగుతోంటే

ఆ తల్లిదండ్రుల ఆనందం చెప్పలేనంతగా ముఖంమీద కనిపిస్తోంది. 'అదృష్ట వంతులం!' అనే భావన వాళ్ళలోంచి దర్శనం ఇస్తోంది.

"మాబాబు ఏడండీ!–" "మాపిల్లాడు రాలేదేం?" "శివంరాలేదా?"– "మిగిలిన వాళ్ళు ఏరండీ?–" రకరకాల ప్రశ్నలు మొదలయ్యాయి.

ఒక్కసారి అందర్నీ ఎదుర్కోవటం కష్టం–విషయం విన్న హెడ్మాస్టరు వచ్చి ముందు మూర్తిని వెళ్ళిపొమ్మన్నారు. "ఇక్కడ ఉంటే నీకు చాలా కష్టం! ఎవరెలా ప్రవర్తిస్తారో చెప్పటం కష్టం! ముందు నువ్వు వెళ్ళిపో మూర్తీ!" అన్నారాయన.

"వెళ్ళిపోతే........!" అనిపించింది మూర్తికి క్షణం కానీ....తనవల్లజరిగిన పొరబాటుకాదని. ప్రమాదం– ప్రమాదవశాత్తూ జరిగింది. తను ఏ రకంగా బాధ్యుడు! అందుకే వెళ్ళననిచెప్తూ ఉండిపోయాడు.

"ఇంకా కొందరు దొరికే అవకాశాలు ఉన్నాయండీ! ఆ కంగారులో కొందరు తప్పిపోయి ఉంటారు. మరి కొందరు ఇంకొకరితో వెళ్ళిపోయి ఉంటారు!...."

"మరికొందరు చచ్చిపోయిఉంటారు! కదండీ" అన్నారెవరో–మూర్తికి భయం వేసింది ఆ కంఠస్వరానికి.

అటు తిరిగాడు–పట్టాభి అంటున్నాడు ఆ మాట! పట్టాభి ఇద్దరు కొడుకులూ తనతో వచ్చారు కానీ తిరిగి వచ్చేటప్పుడు తాను కనీసం ఒకడినైనా– వెనక్కు తేలేకపోయాడు. ఎంతో ప్రయత్నించాడు తాను, కానీ....

ఎవరూ సాయం చేయలేకపోయారు పట్టాభి నుదుటిమీద గీతల్ని వంకర

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్ ను వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్ ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు ________

విలాసము ________

________ PIN ________

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్

తీసేందుకు! తన ప్రయత్నాలు విఫలమైనాయి.

"అదికాదండీ!...." నచ్చ చెప్ప బోయాడు మూర్తి.

"నచ్చచెప్పటం దేనికండీ! సరిగ్గా చెప్పండి. మా బాబులు ఇద్దరూ - ఇద్దరికిద్దరూ గోదారిపాలయిపోయారా?"

—సూటిగా ప్రశ్న.

మూర్తికి భయం వేసింది అంత సూటిగా అతను వేసిన ప్రశ్నకు జవాబు చెప్పాలంటే!

కానీ....

నేను....నా చేతనైనంత ప్రయత్నించా నండీ!..." మాటలు పేర్చు కొంటూ అన్నాడు మూర్తి.

బాగా చెప్పారు! మీ చేతనైనంత ప్రయత్నించి, మీపిల్లాడిని రక్షించుకో గలిగారు!"

మూర్తి మనసొక సారి వణికింది.

అంటే....!-?

అబ్బె, అది కాదండీ....!"

ఛ. పట్టాభిగారూ, మీరు పొరపడు తున్నారు!-" కలిపించుకొంటూ అన్నాడు హెడ్మాస్టర్‌గారు.

పొరబడటం కాదండీ, అది జీవిత సహజం! ఏ ప్రాణికైనా ముందు తన వారిని రక్షించుకోవాలనే తపన ఉంటుంది! మూర్తికీనూ అంతే!" పట్టాభి అన్నాడు కఠినం తీవ్రంగా. ఆ కంఠంలో బాధ ఉంది. అది అపుకొన్నా ఆగటం లేదు అందుకే స్పష్టంగా మాటలలోంచి కూడా ఆ బాధ బయటపడ తోంది

మూర్తికి జరిగిన సంగతి గ్రహించింది -ఎక్కడ ఉంది ఆ క్రూరత్వం తన చేతల్లో! పొరపాటునైనా తన బిడ్డనే రక్షించుకోవాలనుకోలేదే! ఎవరు చేతికి అందితే వారిని లాగి బయట వడేశాడే తప్ప....

బయట పడ్డవారిలో తనకేశవుడు ఉండటం యాదృచ్ఛికం!!

—ఎవరికి చెప్పాలి ఆసంగతి! ఎలా చెప్తే నమ్ముతారు ఆవిషయం!

నిజాన్ని చెప్తే, నమ్మక పోతే....నిజానికి నిజాన్ని నమ్మక పోవటం కన్నా నిజానికి లోకం చెయ్య గలిగే అవమానం లేదు.

ఒక్కసారి నిజం కూడా తనను తాను రక్షించుకోలేక పోతుంది కాబోలు! నిలకడ మీద తేలాల్సిన నిజం క్షణాల మీద ఎలా తేలు తుంది?

కానీ- ఈనిజం ఇలా నిజంగా చలామణీ అయ్యే అవకాశం లేకుండానే పోతుంది కాబోలు!!

-మూర్తికి తల కొట్టేసినట్లు ఉంది.

బాధ. గుండెల్లో రంపపు కోత. ఎక్కడెక్కడో మూల మూల నుంచి నిస్సహాయత చేతకానితనం.

తలవంచుకుని వచ్చేశాడు మూర్తి.

ఏం చేస్తే నమ్ముతారు ఈ నిజాన్ని!

ఏం చేస్తే తాను చేసింది సరైందని ఒప్పుకొంటారు??

ఇంటికి వచ్చి, ఆలోచనతో తల మునకలై....

ఆఖరికి....

"కేశవా!" అని కేకేసాడు మూర్తి.

కేశవు వచ్చి లండ్డాడు చెప్పండి" అంటు

మూర్తి ఓ కాగితంమీద నాలుగు వాక్యాలు బరబరా రాసి ఇచ్చాడు. ఇది తీసుకెళ్ళి పట్టాభిగారింట్లో ఇయ్యి!" అన్నాడు.

కేశవుడు సరేనంటూ కదిలాడు.



అక్కడ.... కేశవుడు ఆ ఉత్తరం పట్టాభి ఇంట్లో ఇస్తాడు. పట్టాభి ఆ వుత్తరం విప్పుతాడు. అందులో– 'మీరు నన్ను నమ్మలేదు. నేను ఏ ఆలోచన లేకుండా చేసినపనికి దురాలోచనను, స్వార్థాన్ని అంటగట్టారు. ఆ క్షణంలో నాకు చేతికి అందిన వాడినే బయటకు తెచ్చాను. కానీ ఎంచి కాదు, మావాడనీ వెతికీ కాదు! ఆ క్షణాలు అలాటివి. నా వరాయి అనే ఆలోచననే రానివ్వవు. పోనీండి, మీరెలాగు నా మాట నమ్మక పోవచ్చు. కానీ మీరు ఇద్దరు పిల్లల్ని పోగొట్టుకొన్నారు. కాదనను నావల్లనే జరిగిందనుకొన్నారు మీరు. అదీ తప్ప నను. కానీ ఆదుకొనే క్షణాల్లో, ఆదుకో వాల్సినక్షణాల్లో మానవత్వం ఎలా స్వపర భేదాల్ని మరచిపోతుందో మీకు అనుభవం లోకి తెస్తాను! మీకు మీ పిల్లల్ని ఎలాగైనా తెచ్చి ఇవ్వలేను. ఇకపై బతికినంత కాలమూ ఈ నింద మోస్తూ బతకలేను. అందుకే ఈ రెండు సమస్యలకూ ఒకే పరిష్కారంగా– నా కేశవుడిని మీకు అప్పగించి వెడుతున్నాను. నేనూ గోదావరి లోనే ముని గా ననుకోండి....'' అని ఉంటుంది ఆ వుత్తరం చదివిన పట్టాభి నివ్వెరపోయి, తర్వాత తేరుకొని, తన ఇంటికి పరుగున వస్తాడు. కానీ అప్పటికి తాను ఎక్కడ ఉంటాడు?– ఎక్కడో తెలీని ఆ గమ్యానికి చేరటానికి కదా ఈ ప్రయాణం.

అనుకుంటూ మూర్తి లేచి తలుపు గడియ వేశాడు.

తర్వాత శవంలాగ ఇంటి మధ్యకు నడిచాడు.

ఒకసారి ఇంటిదూలంకేసి చూశాడు. కనిపిస్తున్న దూలాన్ని దాటి, ఆపైన ఉన్న కప్పునుదాటి, ఆ కళ్ళు ఏదో గమ్యాన్ని వెతుకుతున్నాయి. అతనికి– క్షణంసేపు గోదావరి తనను ఆహ్వానిస్తూ పిలిచినట్లుగా కనిపించింది. ★